# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 11-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ పార్లమెంట్ సభ్యుల కోసం కొత్తగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ప్రారంభించారు.

❖ క్రీడా రంగానికి సంబంధించిన రెండు కీలక బిల్లులకు ఈ రోజు లోక్ సభ ఆమోదం తెలిపింది.

❖ అణ్వాయుధాల వినియోగంపై పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది.

❖ రైతుల జీవితాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.

❖ ఢిల్లీ-NCR ప్రాంతంలో రాగల 3 రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ సభ్యుల కోసం దేశ రాజధాని ఢిల్లీలోని బాబా ఖడక్ సింగ్ మార్గ్‌లో కొత్తగా నిర్మించిన 184 ఫ్లాట్లతో కూడిన బహుళ అంతస్తుల భవనాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ... 2014 నుండి ఇప్పటివరకు ఎంపీల కోసం సుమారు 350 కొత్త ఇళ్లను నిర్మించామని తెలిపారు. వివిధ రాష్ట్రాల ఎంపీలు ఇక్కడ కలిసి నివసిస్తున్నారని, ఇది ఏక్ భారత్ శ్రేష్ట భారత్ స్ఫూర్తికి ప్రతీక అని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇక్కడున్న నాలుగు స్తంభాలకు దేశంలోని గొప్ప నదులైన కృష్ణ, గోదావరి, కోసి, హూగ్లీ నదుల పేర్లను పెట్టారని, ఇది దేశాన్ని ఐక్యతా మార్గంలో నడిపిస్తుందన్నారు. పార్లమెంటు సభ్యులందరూ ఒక బృందంగా కలిసి పనిచేస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తారని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ క్రీడా పాలన బిల్లు 2025, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు 2025లను ఈరోజు లోక్‌సభ ఆమోదించింది. ఈ సందర్భంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ... క్రీడా రంగంలో అతిపెద్ద సంస్కరణలను తీసుకువచ్చేందుకు ఈ బిల్లులు దోహదపడతాయన్నారు. దేశంలో బలమైన క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాల ఫలితమే ఈ బిల్లులు అని ఆయన వ్యాఖ్యానించారు. జాతీయ క్రీడా పాలన బిల్లు దేశంలో ప్రపంచ స్థాయి క్రీడా మౌలిక సదుపాయాలను సృష్టించడానికి మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. అంతర్జాతీయ సంస్థలు రూపొందించిన నియమాలకు అనుగుణంగా జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లును తీసుకువచ్చామని మన్సుఖ్ మాండవీయ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

అదేవిధంగా పన్ను చట్టాల (సవరణ) బిల్లు 2025, ఆదాయపు పన్ను (నెం.2) బిల్లు 2025లను కూడా మూజువాణి ఓటుతో లోక్‌సభ ఈరోజు ఆమోదించింది. బీహార్ ఎన్నికల జాబితాలో చేపట్టిన ఎస్ఐఆర్ సవరణలు, ఇతర అంశాలపై విపక్ష సభ్యులు నిరసనల మధ్య కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లులను ప్రవేశపెట్టారు. ఆదాయపు పన్నుకు సంబంధించిన చట్టాన్ని ఆదాయపు పన్ను (నెం.2) బిల్లు ఏకీకృతం చేయగా ఆదాయపు పన్ను చట్టం 1961ని పన్ను చట్టాల (సవరణ) బిల్లు మరింత సవరించనుంది.

=========================

అణ్వాయుధాల వినియోగంపై పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. భారత్ ఎటువంటి అణు బెదిరింపులకు భయపడదని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దేశ భద్రత కోసం ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోదని స్పష్టం చేసింది. అమెరికాలో పర్యటనలో ఉన్న అసీమ్ మునీర్ ఇటువంటి వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధ్యాతారాహిత్యమని పేర్కొంది. ఈ వ్యాఖ్యలు కేవలం ప్రాంతీయ భద్రతను మాత్రమే కాకుండా అంతర్జాతీయ భద్రతను కూడా ప్రమాదంలోకి నెట్టేవిధంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేసింది.

=========================

దేశ రాజధాని ఢిల్లీలో వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కుక్కలు కరవడం వల్ల, రాబిస్ వంటి వ్యాధుల కారణంగా.. మరణాలు పెరుగుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 8 వారాల్లోపు వీధి కుక్కలన్నింటినీ షెల్టర్లకు తరలించాలని పేర్కొంది. ఈ చర్యలను అడ్డుకోవడానికి ఏవైనా సంస్థలు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. పిల్లలపై వీధి కుక్కల దాడులు జరుగుతున్నాయనే నివేదికల ఆధారంగా దాఖలైన పిటీషన్‌లో ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆదేశాలు జారీ చేశామని ధర్మాసనం పేర్కొంది. అంతేకాక ఒక వారంలోపు హెల్ప్‌లైన్ నెంబర్ ఏర్పాటు చేసి, కుక్క కాటు ఫిర్యాదులపై 4 గంటల్లోపు చర్యలు తీసుకోవాలని సూచించింది.

విరామం

=========================

రైతుల జీవితాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని కేంద్ర రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని ఝున్ ఝునూలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన కింద దేశంలోని 35 లక్షలకు పైగా రైతులకు 3,900 కోట్ల రూపాయల క్లైమ్స్‌ను రైతుల ఖాతాలో జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల ఆదాయాన్ని పెంచడం ద్వారా వారి సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. నాణ్యత లేని ఎరువులు, విత్తనాలను అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక రోజువారీ అవసరాలకు స్వదేశీ ఉత్పత్తులను ఉపయోగించాలని కేంద్ర మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

దేశ వ్యాప్తంగా వన్యప్రాణుల పరిరక్షణ, నిర్వహణ కోసం ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ వైల్డ్ లైఫ్ హాబిటాట్స్ పథకాన్ని అమలు చేస్తోందని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖల మంత్రి భూపేందర్ యాదవ్ అన్నారు. లోక్‌సభలో ఈరోజు ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... ఈ పథకం కింద, వన్యప్రాణుల ఆవాసాల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆర్థిక సహాయం అందిస్తోందని చెప్పారు. 24 జాతుల వన్యప్రాణులను అంతరించిపోతున్న జాబితాలో చేర్చామని, వాటి సంరక్షణ కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్రమంత్రి వెల్లడించారు.

==========================

మహారాష్ట్ర పూణే జిల్లాలోని పర్వత ప్రాంతం గుండా ప్రయాణిస్తున్న ఓ వ్యాన్ అదుపుతప్పి లోయలోకి పడిపోవడంతో ఎనిమిది మంది మహిళలు మరణించగా.. మరో 25 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రధానమంత్రి ఆకాంక్షించారు. మరణించిన వారి కుటుంబానికి 2 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారాన్ని ప్రకటించారు.

==========================

హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో రాగల 24 గంటలలో  భారీ నుండి అతి భారీ  వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. అలాగే అండమాన్ నికోబార్ దీవులు, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, బీహార్, తూర్పు మధ్యప్రదేశ్ లలో కూడా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఢిల్లీ-NCR ప్రాంతంలో రాగల 3 రోజులలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారి సుప్రీత్ కుమార్ వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================
==========================